# కొత్తచీర

రంగి నెమ్మదిగా పెరటి తలుపు తట్టింది. మెరుపులా వచ్చి తలుపు తీసింది సుశీల. రంగిచూపులు సుశీల కట్టుకున్న చీరమీద నిలిచిపోయాయి.

సుశీల కట్టుకున్న చీర ఎంతో ఖరీదైనదనీ, మరెంతో అందమైనదనీ ఆకర్షించలేదు రంగిని. సుశీల కట్టుకున్నది కొత్తచీర. ఎవరు కొత్తచీర కట్టుకున్నా రంగి అలానే చూస్తూండిపోతుంది.

"అదేంటే రంగీ! అలా చూస్తున్నావ్? నా కొత్త చీర బాగుంది కదూ? ఈ చీర జరీ అంచు నాకెంతో నచ్చిందే. నిన్న షాపింగుకు వెళ్ళినపుడు ఈ చీర తీసుకున్నా. ఈ వేళ నా పుట్టిన రోజేరంగీ" అంది.

రంగి సుశీల దగ్గరగా వచ్చింది. "సేనా బాగుంది అమ్మగోరూ!" అంది.

తల్లి పిలవడంతో సుశీల లోపలికి వెళ్ళిపోయింది. రంగి అంట్లగిన్నెలు ముందేసుకుని తోములోంది. 'కొత్త సీర ఎంత బాగుందో!" పదే పదే అనుకోసాగింది.

రంగికి చిన్నతనంతో తల్లి కొత్తచీర కట్టుకుంటే చూడాలి అని కోరిక వుండేది. చిత్రమేమిటంటే ఆ కోరిక అలా తీరలేదు. కాని, రంగికి ఈడువచ్చేక ఆ కోరికే, అదే కోరిక! 'తను కొత్త చీర కట్టుకోవాలి' అని రూపం మార్చుకుంది.

బలమైన ఆ కోరిక రంగి మనస్సును మాటిమాటికి కలవరపెడుతోంది. రంగి ఈ రోజు ఎప్పటిలా చకచకా పని చేయలేకపోతుంది. ఆ ఇంటి పని ముగించి. ఎదురింటికి వెళ్ళేసరికి చాలా ఆలస్యమైపోయింది. ఫలితం ఆ ఇంటి ఇల్లాలిచేత చీవాట్లు. రంగి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఆ ఇంటిపనికూడా ఎలాగో ముగించి గుడిసెకు తిరిగి వచ్చింది. అప్పటికే బాగా చీకటి

పడిపోయింది. ఆకలిగా వున్నా రంగికి అన్నంతినాలనిపించలేదు. తల్లి రంగిని భోజనం చేయమని ఎంతో బ్రతిమాలింది. కాని రంగికి ఆరోజు అన్నం రుచించదని తెలుసు. అందుకే తల్లి ఎంత నచ్చచెప్పినా భోజనం చేయకుండానే చాప వేసుకుని పడుకుంది.

రంగి అలా దిగాలుగా ఎందుకుందో ఆదెమ్మ ఊహించలేకపోలేదు. 'మళ్ళీ కొత్త చీర కళ్ళబడి వుంటాది. అందుకే ఇలా వుంది ఇయ్యాల ఈ పిచ్చిమాలోకం'.

ఎప్పుడూ కొత్తచీర కావాలని బాధపడే కూతుర్ని చూస్తుంటే ఒక కొత్తచీరైనా కన్నబిడ్డకు కొనిపెట్టలేకపోతోంది. ఎవరైనా కనికరించి ఇచ్చే పాత చీరలే ఇప్పటివరకూ కడ్తోంది రంగి.

రంగి చిన్నతనంలో జరిగిన ఓ సంఘటన ఆదెమ్మ మనసులో మెదిలింది. అది పెద్దపండగ . బీదాబిక్కీకూడా ఎలాగోలా ఇంటిల్లిపాదీ కొత్తబట్టలు కట్టుకుంటారు. పండుగ పట్టుమని పదిరోజులుందో లేదో పిల్లలంతా తనుచుట్టూ చేరి "అమ్మా! అయ్య కొత్త బట్టలెప్పుడట్టుకొత్తాడే!" అంటూ అడగడం మొదలుపెట్టేరు. ఆదెమ్మ భర్తకు చెప్పింది.

"యెర్రిమొగమా! కూడే రెండుపూట్లా తిననోళ్ళం. కొత్త బట్టలెట్లా కొనుక్కునేదంటా".

"అదేంటి మావా! మనం కట్టుకోలేకపోయినా, పిల్లోళ్ళ సరదా ఎట్టా కాదంటాం. యారి కాడైనా అప్పొసప్పో చేసి పిల్లోళ్ళకి కొత్త బట్టలట్టుకురా".

ఆదెమ్మ చెప్పిన ప్రకారం చేశాడు అప్పన్న. పండగరోజు పిల్లందరూ కొత్తబట్టలు తొడుక్కున్నారు. ఆదెమ్మ కొత్తబట్టల్లో పిల్లల్నిచూసి పొంగిపోయింది.

అప్పుడే తలంటుకుని వచ్చిన రంగికి లంగా జాకెట్టు అందించి "ఈ బట్టలు కట్టుకో" అంది ఆదెమ్మ.

కొత్తబట్టల్లో వున్న చెల్లెళ్ళనీ, తమ్ముళ్ళనీ చూసింది రంగి. మనస్సులో ఏదో కలుక్కుమందేమో. తన ముఖంలోకి ఒక్కసారి చూసి "అమ్మా! నీకేదే కొత్తసీర" అని అడిగింది.

"నాకెందుకే పిచ్చిమొకమా? నాను కట్టుకోనేకపోతే ఏటైందేటి? పిల్లోళ్ళకుంటే నాకున్న ట్టేనే పిల్లా".

"నువ్వు కొత్తసీర కట్టుకోవాల! అంతే రంగి రెట్టించింది.

"నువ్వు కొత్తబట్టలుకట్టుకోసాలు! సందేళకి నాకమ్మగారు పాతసీర ఏదో ఇత్తారులేయే"

అమ్మ జవాబు రంగికి తృప్తి కలిగించలేదు. ఆ మధ్యాహ్నం "అయ్యా! అమ్మకి కొత్తసీర కొనెట్టు" అంటూ చాలాసేపు గొడవచేసింది.

అప్పన్నకు విసుగపుట్టి రంగిని రెండుదెబ్బలు వేసేడు. ఆదెమ్మ చూడలేకపోయింది.

రంగిని దగ్గరకు తీసుకుంది. నెమ్మదిగా సముదాయించి రంగికి కొత్తబట్టలు కట్టింది. ఆదెమ్మ కొత్తచీర కట్టుకోకుండానే పండగ గడచిపోయింది. అలా ఎన్నెన్నో పండగలు ఆదెమ్మ

కొత్త చీర కట్టుకోకుండానే దొర్లిపోయేయి. ఇప్పుడు రంగికి ఆ వారసత్వమే వచ్చింది. చిన్నపిల్లలంతా కొత్త బట్టలువేసుకున్నా రంగి, ఆదెమ్మ పాతచీరలే కడుతున్నారు. తనకు ఒక్కటైనా కొత్తచీర కొనిపెట్టమని అప్పుడప్పుడడిగేది. కానీ కొత్తచీర కట్టుకోవాలన్న కోరిక రోజురోజుకూ పెరుగుతూనే వుంది. కొత్తచీర ఎవరు కట్టుకోగా చూసినా తనలో వున్న కోరిక ములుకులా రంగి మనసును బాధించి ఆ రోజు నిద్రాహారాలకు దూరంచేస్తుంది. ఈరోజు కూడా కూతురి. విషయంలో అదే జరిగి వుంటుంది. నిట్టూర్చింది ఆదెమ్మ.

ఆమె ఎంత ఓదార్చినా మనసు మనసులోలేదు. నిద్రలోకి ఎప్పుడో జారుకుంది రంగి.

కూతురు దగ్గరికెళ్ళి నిద్ర లేపింది.

"కొత్తసీర - కొత్రసీర..." మగతలోనే పలవరిస్తోంది రంగి.

నేనూహించింది నిజమేనన్న మాట అనుకుంది ఆదెమ్మ. ఆ తల్లి మనసు రెపరెపలాడింది కొత్త చీర కొనడంకోసం ఎన్నో సార్లు ప్రయత్నించింది ఆదెమ్మ. ఎలాగైనా కూతురి ముచ్చట తీర్చాలని ఎంతగానో అనుకుంది. రంగికి చీర కొనడం కోసం ఆదెమ్మ తన జీవితంలో పైసా పరకా వెనకవేసింది. ఆ పైసలు రూపాయిలుగా పెరుగుతూ వుంటే రంగికి చీర కొన్నట్టే మురిసిపోయేది. కానీ ఆ డబ్బుతో పాటు తనలో మరో ప్రాణి పెరుగుతున్నట్టు కొంతకాలానికి గాని తెలుసుకోలేకపోయింది. తను రంగికి చీర కొనడంకోసం కూడబెట్టిన సొమ్ము తన పురిటికి ఖర్చయిపోయింది.

మరోసారికూడా అలాగే పైసా పైసా కూడబెట్టింది. అప్పన్నకు ఏదో మాయరోగం వచ్చి ఆ డబ్బు హారతికర్పూరంలా హరించుకుపోయింది. ఇలా ఎన్నోసార్లు పైసా పరకా కూడబెట్టి చీరకోసం ఆదెమ్మ డబ్బు పోగుచేయడం అది ఏదో రూపాన ఖర్చయిపోవటం. రంగికి కొత్తచీర కొనిపెట్టలేకపోవడం పరిపాటైపోయింది. రంగికి కొత్తచీర కొని పెట్టగలిగే రోజు వచ్చేదెప్పుడో? ఆలోచిస్తూనే ఆదెమ్మ నిద్రలోకి జారుకుంది.

వేకువనే లేచి ఆదెమ్మతో పాటు పనిలోకి వెళ్ళింది రంగి. రంగి ఇంటికి వచ్చేసరికి తల్లి చెప్పింది. అన్నయ్య నిన్నొమారు రమ్మన్నాడట. ఆ మాటలు వింటూనే రంగి సంబరపడింది.

మెల్లగా తల్లి దగ్గరచేరి "అన్నకాడ రెండూపూటలుంటానే నేను పనిచేసే ఇల్లుకాడకూడా ఆ రెండుమాటలు చేప్పెట్టెయ్యమ్మా!" అంది.

తల్లిసరే అనడంతో మరింత సంబరంతో తమ్ముళ్ని సాయం తీసుకుని పొరుగూరిలో వున్న అన్నయ్య ఇంటికి వెళ్ళింది.

రాములు రంగికి స్వయాన అన్న కాకపోయినా ఎంతో ప్రేమ చూపిస్తాడు రంగి పట్ల అతని భార్యకూడా అంతే, ఎంతో అభిమానిస్తుంది. వాళ్ళదగ్గర వున్నపుడు రంగికి ఎంతో ఆనందంగా సమయం గడిచిపోతుంది.

రంగిని - చూస్తూనే "బావున్నావా రంగీ! అంటూ చెయ్యి పట్టుకుని లోపలికి తీసుకెళ్ళింది సీత.

"నిన్ను చూసి సేన్నాళ్ళైందే సెల్లెలా!" ఆప్యాయం నిండిన స్వరంతో అన్నాడు రాములు.

కాసేపు ముచ్చట్లాడుకున్నాక రంగికి భోజనం పెట్టింది.

ఆ సాయంత్రం రాములు ఇంటికి వచ్చేటపుడు రెండు కొత్త చీరలు తీసుకొచ్చాడు.

అవి చూసేసరికి రంగి కళ్ళు కొత్తకాంతులతో మెరిశాయి. ఇన్నాళ్ళకు తన కోరిక తీరబోతోంది. తనకో చీర, వదినకో చీరపట్టుకొచ్చేడు. అన్నయ్య ఎంత మంచివాడు. పొంగిపోయింది రంగి. చీరలు రెండు చేతుల్లోకి తీసుకుని " వదినమ్మోయ్! ఈ రెండిట్లో నాకే సీరిత్తావ్"

రాములూ, సీత రంగి మాటలకు అదిరిపడ్డారు. "రెండు సీరలూ మీ వదినకేనే,ఎప్పుడైనా నీ కొనిపెడ్తానేయే" అన్నాడు.

రంగిముఖం చిన్నబోయింది దుఃఖాన్ని అణచుకోలేకపోతోంది.

సీత రంగిభుజం మీద చెయ్యి వేసి "చూడే రంగీ, నీకు బలేగా నచ్చినచీర ఒకటి నేనిస్తాగా" అంటూ తన పెట్టె తెరిచి ఓ పాత చీర తెచ్చి రంగి చేతుల్లో వుంచింది. మర్నాడే రంగి తమ్ముడితో కలిసి ఇంటికి తిరిగి వచ్చేసింది.

"సీర సేనాబాగుందే. సీత నీకచ్చంగా ఇచ్చేసినాదంటే"చీర చూసి మురిసిపోతూ ఆదెమ్మ అంది. తల్లి బలవంతంమీద ఆ చీర కట్టుకుని మధ్యాహ్నం పనికి బయల్దేరింది.

అన్న వదినకు కొత్త చీరలు తేవటం, తనకుమాత్రం పాత చీరే ఇవ్వడం ఇంకా రంగి కళ్ళల్లో కదలాడుతూ మనసు కలవరపెడుతున్నాయి. రంగి పరధ్యానంగా పనిచేసుకుంటోంది. రంగి పెరడు ఊడుస్తుండగా సుశీల వచ్చింది.

"అబ్బో! రంగీ! నీ చీర చాలా బాగుంది. నల్లచీరమీద తెల్ల పువ్వులు! అబ్బ! బలే అందంగా వుంది" అంది.

"ఏంబాగో సుశీలమ్మగోరూ పాత సీరేగా" అనేసింది. రంగి మనసులో గతం మెదలుతోంది. ఈ చీర తను కొత్తదిగానే కట్టుకోవాలనుకుంది. అన్నయ్య ఈ చీర కొన్నపుడు తనూ అక్కడేవుంది. అన్నయ్య వదినచేతిలో చీరపెట్టగానే " వదినమ్మోయ్! ఈ సీరనాకియ్యవూ" చిన్నపిల్లలాగా అడిగింది.

"పెద్దోళ్ళ ఇళ్ళకాడ పని సెయ్యాలే మీ వదిన! అందుకే బోలెడుడబ్బెట్టికొన్నా, నీకిత్తే ఎట్టాగే? సెప్పు! నీ పెళ్ళికి నీకు కొత్తసీరట్టుకొత్తలేయే!".

అన్నా, వదిన అలా అనేసిన ఆ కొత్త చీరకోసం ఎంతో గొడవ చేసింది. కానీ, అది కొత్తచీరగా వదిన కట్టుకుంది. పాతబడ్డాక తనకిచ్చేసింది. ఆలోచిస్తూనే పని ముగించుకుని ఎదురింటి కెళ్ళింది. అన్యమనస్కంగానే పని చేసుకుపోతోంది.

"బాగున్నావా! రంగీ" రాణి పలకరింపుతో రంగికి హాయి అనిపించింది. తను ఎన్నో ఇళ్ళల్లో పనిచేస్తున్నా రాణీ అంటే రంగికి ప్రాణం. అందుకు కొంతవరకు రాణి స్నేహహృదయమే కారణం. రాణి రంగినెప్పుడూ పనిమనిషిలాచూడదు. ఓ స్నేహితురాలిలా భావిస్తుంది. రంగి పనిచేస్తున్నంతసేపు తియ్యగా కబుర్లు చెప్తూ అక్కడే బెంచిమీద కూర్చుంటుంది.

రాణి పెళ్ళై అత్తవారింటి వెళ్ళిపోతుంటే కళ్ళనీళ్ళుపెట్టుకుంది. ఆఇంట్లో పనిచేసేటప్పుడల్లా రాణి లేని లోటు రంగిని బాధించింది. ఏడాది తిరక్కుండానే రాణి పురిటికి పుట్టింటికి వచ్చింది. అప్పుడు రంగి సంతోషం ఇంతా అంతాకాదు. రాణికి పాపాయి పుట్టినప్పుడు రంగి అపరిమితమైన సేవ సరదాగా చేసింది. ప్రేమతో చేసింది. ఎగిరిగెంతుతూ చేసింది. మరెందుకు అంతప్రేమో రాణి అంటే, పాప అంటే, అన్నిపనులూ తల్లికి అప్పచెప్పేసి, తను ఆ ఇంట్లోనే రాణి దగ్గర వుండిపోయింది. పాప కొద్దిగా పెరుగుతూ వుంటే రంగికి ఎంత ఆనందమో! పాప పుట్టడంతో రాణికి, రంగికి వున్న అనుబంధం మరింత అల్లుకుపోసాగింది.

"నేను ఎల్లుండి మా వూరు వెళ్ళిపోతున్నానే".

రంగి ఉలిక్కిపడింది. "అదేటి రాణమ్మగోరూ! అప్పుడే ఎల్లిపోతారా?"

"బాగుందే రంగీ!... పాపాయికి రేపటికి రెండునెలలు నిండిపోతాయి. ఇంకా ఎన్నాళ్ళుంటాను ఇక్కడ?"

"రాణమ్మగోరూ! మీరెల్లి పోతే నా మనసెట్టాగో అయిపోతాది. నాను బతకనేనమ్మగోరూ"

"నిజమే రంగీ! నాకూ చాలా బాధగా వుంది. కానీ, నేనెక్కడ వున్నా నిన్నెప్పుడూ తలుస్తూనే వుంటానే!"

రంగి కళ్ళల్లో కన్నీళ్ళు పొంగేయి.

రాణి రంగికి దగ్గరగా వెళ్ళి "ఏడుస్తావేంటే పిచ్చిపిల్లా! మళ్ళీ వస్తాగా!" అంటూ ఓదార్చింది.

రంగి దుఃఖాన్ని ఎలాగో బిగపట్టుకుని ఇంటికి వెళ్ళి పోయింది.

ఆ మర్నాడు రంగి పనిలోకి రాగానే రాణి తల్లి "రంగీ! ఈ చీరలు రెండూ తీసుకో! మా రాణికోసం, పాపకోసం నువ్వు చాలా కష్టపడ్డావు. వాళ్ళకు అన్నీ వేళకి చేసిపెట్టావు. నీ కష్టం వుంచుకోంలే!" అంటూ కొద్దిగా పాతబడ్డ చీరలు రంగికి ఇచ్చింది.

"ఇవీ పాతసీరలేనా! నానుకొత్తసీర కట్టానికి నోచుకోనేదు" అప్రయత్నంగా అనేసింది మరి కొత్తచీరమీద మోజుతో.

ఈమాట రాణితల్లి వినిపించుకోనేలేదు. కానీ అక్కడే కూర్చుని పాపాయికి పాలుపడ్తున్న రాణి మనసును మాత్రం కదిలించింది, కలవరపెట్టింది.

'అవును! తనెంత పొరపాటు చేసింది. రంగి ఎన్నోసార్లు తనతో అంది ఒక కొత్తచీర కట్టుకోవాలని వుంది అని. దాని కోరిక తెలసుండి కూడా తనేమిటి ఇలా చేసింది. అమ్మ నిన్నరాత్రి ఈ రెండుచీరలు రంగికిచ్చేస్తానంటే సరే అనేసింది.

పాపనెత్తుకుని గబగబా లోపలికెళ్ళింది రాణి. తన పెట్లోంచి ఓ కొత్తచీర తీసుకుని రంగిదగ్గరికి పెరుగెత్తింది. తోమిన గిన్నెలు లోపలపెట్టేసి వెళ్ళిపోబోతున్న రంగి చేయి పట్టుకుంది.

"ఇదిగోనే రంగీ!"

"ఇదేటి రాణమ్మగోరూ! ఇప్పుడే అమ్మ ??? రెండు సీరలు ఇచ్చేసినారుగా! కొత్తసీరేటి. నాకేటి?" ఆశ్చర్యంగా చూసింది రంగి.

"అలాకాదు. ఈ కొత్త చీరనీకే. నేనిస్తు ???ను తీసుకో. సాయంత్రం ఈ కొత్తచీరకట్టుకునే రావాలిసుమా" రాణిరంగి చేతుల్లో వుంచింది

ఇన్నాళ్ళకు తనకోరిక తీరిన ఆనందం రంగిని ఉక్కిరి బిక్కిరి చేసింది. ఆ సాయంత్రమే రాణి చెప్పినట్టే కొత్తచీర కట్టుకుని రాణిదగ్గరకు వచ్చింది రంగి.

"ఈ చీర కట్టుకుంటే ఎంతో బాగుందే రంగీ!"

"మీరిచ్చిందే గదా రాణమ్మ గోరూ! మీ మంచి మనసులా తెల్లగావుంది ఈ సీర! పైని అద్దిన పూలు మీ సల్లని మాటల్లా మెరిసిపోతున్నాయి". తను కట్టుకున్న చీరను చూసుకుని మురిసిపోతూ అంది రంగి. రాణిపైన ఆమె మనసులో నిండి తొణికిసలాడుతున్న కృతజ్ఞత అంతా ముద్దులరూపంలో పాపాయిమీద కురిపించింది.

*వనితా జ్యోతి మాసపత్రిక జూన్ 1999* ❑